నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 7 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

రామయ్యకు నిత్యకల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, మార్చి 6: భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన పూజలు చేశారు. ఆరగింపు, సేవాకాలం, నిత్య బలిహరణం, నిత్యహోమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణ వేడుక నిర్వహించారు. కల్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలను, శేష వస్త్రాలు అందజేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, మార్చి 6: కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని 135 మంది కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం కొత్తగూడెంలో పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోనా, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు.. గులాబీ దండు సమాయత్తం



- నేడు నగరంలో ఖమ్మం పార్లమెంటరీ స్థాయి విస్తృత సమావేశం
- హాజరుకానున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- పాల్గొననున్న నామా, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి, తాతా మధు, అజయ్
- పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్న యువనేత

ఖమ్మం, మార్చి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించేందుకు ఆ పార్టీ గురువారం ఖమ్మంలో శంఖారావం పూరించనుంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీకి మెజారిటీ సంఖ్యలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్నారు. దీంతో ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు పార్టీ కార్యాచరణ ప్రారంభించింది. ఖమ్మం లోక్‌సభ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ నామా నాగేశ్వరరావును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. రెండుసార్లు ఎంపీగా, ఒకసారి టీడీపీ లోక్‌సభా పక్ష నేతగా, మరోసారి బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేతగా పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. ప్రజా సమస్యలపైనా పూర్తి అవగాహన ఉంది. రాజనీతి వ్యవహారాలపై తిరుగులేని పట్టు ఉంది. దీంతో నామా నాగేశ్వరరావును పార్టీ అధినేత ఖరారు చేశారు. లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కమిటీ గురువారం ఖమ్మం పార్లమెంటరీ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు బుధవారం మీడియా సమావేశంలో వివరించారు. గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్ హాల్లో జరిగే ఈ సమావేశానికి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం చేయాల్సిన కృషి, అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన నామా నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేణుకాచౌదరిపై 1.66 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీ సాధించి బీఆర్ఎస్ సత్తా చాటిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో కూడా పార్టీ విజయం సాధించడం ఖాయమని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందు కోసం పార్టీ శ్రేణులను పూర్తిస్థాయిలో కార్యోన్ముఖులను చేసేందుకు గురువారం ఈ సమావేశం నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జులు, మాజీ శాసనసభ్యులు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణను ఈ సమావేశంలో రూపొందించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అధ్యక్షత వహించనున్నారు. ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, రాములునాయక్, మదన్‌లాల్, బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

నేడు ఖమ్మంలో కేసీఆర్‌కు కృతజ్ఞత సభ

- హాజరుకానున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- వద్దిరాజుకు మరోసారి 'రాజ్యసభ' అవకాశంపై శ్రేణుల్లో ఉత్సాహం
- రవిచంద్రకు సన్మానం.. పాల్గొననున్న పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు..

బీఆర్ఎస్ సభకు సిద్ధమవుతున్న వేదిక

ఖమ్మం, మార్చి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):బీఆర్ఎస్ నేత, బలహీన వర్గాల నాయకుడు వద్దిరాజు రవిచంద్రకు రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుకొనేందుకోసం ఆ పార్టీ ఖమ్మం జిల్లా నేతలు గురువారం ఖమ్మం నగరంలో 'కేసీఆర్‌కు కృతజ్ఞత' పేరిట సభను నిర్వహించనున్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన తరువాత తొలిసారి ఖమ్మం జిల్లాకు వస్తున్న వద్దిరాజును ఘనంగా సన్మానించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు ఖమ్మం బైపాస్‌రోడ్డులోని గాయత్రి గౌండ్స్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు 'కేసీఆర్‌కు కృతజ్ఞత' సభ ప్రారంభం కానుంది. సభకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. బడుగు, బలహీన వర్గాల నేతగా గుర్తింపు పొందిన వద్దిరాజు రవిచంద్రకు మరోసారి రాజ్యసభ అవకాశం ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నారు. ఈ సభకు ఉమ్మడి ఖమ్మంలోని అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు సమాయత్తమవుతున్నారు.

రెండేళ్ల క్రితం పార్టీ అధినేత కేసీఆర్.. వద్దిరాజు రవిచంద్రకు తొలిసారిగా రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. అయితే ఆ పదవీ కాలం రెండేళ్లు మాత్రమే ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 4తో అది ముగియనుంది. ఈ క్రమంలో రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ బలహీన వర్గాల నేతగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన వద్దిరాజుకు పార్టీ తరపున మరోసారి రాజ్యసభ సభ్యుడిగా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ అధినేత కేసీఆర్ కల్పించారు. దీంతో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వద్దిరాజు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ నేపథ్యంలో వద్దిరాజుకు మళ్లీ అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞత తెలియజేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నేతలు.. 'కేసీఆర్‌కు కృతజ్ఞత' పేరిట ఖమ్మంలో గురువారం భారీ సభను ఏర్పాటు చేశారు. యువనేత కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సభలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, రాములు నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, హరిప్రియానాయక్, మదన్‌లాల్, చంద్రావతి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొనున్నారు. రాజ్యసభ పదవిని వద్దిరాజుకు కేటాయించడం ద్వారా బడుగు బలహీన వర్గాలపై పార్టీ అధినేత కేసీఆర్ ప్రత్యేక అభిమానాన్ని చూపినట్లవుతుంది. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో బడుగు బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు, ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన నేతలకు బీఆర్ఎస్ సత్తా చాటేలా పార్టీ నేతలు దిశా నిర్దేశం చేయనున్నారు.

ఏక్‌నాథ్ షిండేలా సీఎం రేవంత్ మాటలు

మోదీని ప్రశంసించిన తీరుతోనే అర్థమవుతోంది..
నేడు వద్దిరాజు సన్మాన, కేసీఆర్‌కు కృతజ్ఞత సభ
హాజరుకానున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధుసూదన్

ఖమ్మం, మార్చి 6 : సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాని మోడీని సభలో ప్రశంసించిన తీరును చేస్తే ఆయనలో ఏక్‌నాథ్ షిండే కనిపిస్తున్నాడని, మహారాష్ట్ర, అస్సాం సీఎంల మాదిరిగానే రేవంత్ కూడా మారుతాడని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మహారాష్ట్ర, అస్సాంలో ఇలాగే మాట్లాడిన వారు తర్వాత పార్టీ మారి.. మోదీకి మద్దతు తెలిపారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. రాహుల్ గాంధీ నరేంద్ర మోదీని విమర్శిస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం 'మోదీ మేరా బడా భాయ్' అంటూ చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటో కాంగ్రెస్ నాయకులే చెప్పాలన్నారు. రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకొస్తే.. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నేతలు, ప్రస్తుత మంత్రులు ఎల్ఆర్ఎస్‌పై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 80 రోజులు దాటినా ఇప్పటివరకు పెన్షన్ డబ్బులు ఎందుకు వేయలేదో ముగ్గురు జిల్లా మంత్రులు సమాధానం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సభలో కేసీఆర్.. కాంగ్రెస్సోళ్ల మాటలు నమ్మితే ఖమ్మంలో నీళ్ల ట్యాంకులు తిరుగుతాయని చెప్పారని, ఆ మాటే ఇప్పుడు నిజమైందన్నారు. కేసీఆర్ బీసీల పక్షపాతి కావడంతోనే వద్దిరాజు రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు. ఎంపీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావును ఖరారు చేశారని, ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గురువారం మామిళ్లగూడెంలోని వీవీసీ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం పార్లమెంటరీ స్థాయి విస్తృత సమావేశం ఉంటుందని, సాయంత్రం బైపాస్ రోడ్‌లోని చెన్నై షాపింగ్ మాల్ పక్కన గాయత్రీ గ్రౌండ్‌లో 'కేసీఆర్‌కు కృతజ్ఞత' సభ ఉంటుందని, దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, నాయకులు ఖమర్, ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, డోకపర్తి సుబ్బారావు, లింగబోయిన సతీశ్, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం ప్రయోజనకరం

కలెక్టర్ ప్రియాంక ఆల

రైతునేస్తం కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : సాగు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నేస్తం కార్యక్రమం ఎంతో ఉపయోగకరం కానున్నదని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. బుధవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పర్చువల్ విధానంలో ప్రారంభించగా.. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రైతులు సాగు చేసి లాభాలు గడించాలన్నారు. రైతు దుక్కి దున్నిన దగ్గర నుంచి పంట వేసే వరకు పంటలపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ఇదొక వేదికలా ఉపయోగపడుతుందన్నారు. రైతుల కోసం పంటల బీమా పథకాన్ని కూడా అమల్లోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏవో బాబారావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు మండే వీరహన్మంతరావు, ఏడీఏ కరుణశ్రీ, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'తో సమస్యల పరిష్కారం

వీసీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వీసీలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపూడి

రఘునాథపాలెం, మార్చి 6 : రైతు సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం 'రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అందించే రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీ వెంకటాయపాలెం రైతు వేదికలో ఖమ్మం నియోజకవర్గ రైతుల కోసం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతులు పంటలు వేసే సీజన్‌లో ఉత్పన్నమయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని తగిన సలహాలు, సూచనలు చేసేందుకు 'రైతు నేస్తం' దోహదపడుతుందన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య ప్రత్యక్ష, పరస్పర విషయ మార్పిడికి రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థతో జూమ్, యూట్యూబ్ లైవ్‌లో అందించనున్నట్లు తెలిపారు. వీసీలో కలెక్టర్ వీపీ గౌతమ్, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దిక్కులేని మొక్కలు!

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో పరిమళాలను పంచి, ఆహ్లాదాన్ని అందించిన పల్లె ప్రకృతి వనాలపై ప్రస్తుత ప్రభుత్వంలో అలవిమాలని అలక్ష్యం సాక్షాత్కరిస్తోంది. నాడు పచ్చందాలను పంచిన ప్రకృతివనాలను నేడు ఏకంగా వికృతవనాలుగా మార్చేసిన మచ్చను మూటగట్టుకున్నారు నేటి పాలకులు. మొక్కలే కదా అనుకున్నారో ఏమో ఏకంగా పక్కన పడేశారు. దీంతో ఏ గ్రామంలో చూసినా జీవం లేని చెట్లు, ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పెద్ద పెద్ద ప్రాజెక్టులపైనే కాదు.. పల్లెసీమల్లోని చిన్నపాటి ప్రకృతి వనాలపై నేటి పాలకుల చిన్నచూపు స్పష్టంగా కన్పిస్తోంది. ఇందుకోసం సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో మచ్చుకు కొన్ని మొక్కలను చూస్తే సరిపోతుంది. పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్యాంకర్లు అందించినా కనీసం మొక్కలకు నీళ్లు పోయడం కూడా మరిచిపోయినట్లుగా కన్పిస్తోంది. ఫలితంగా మొక్కలన్నీ పచ్చదనం లేకుండా మోడువారి ఎండిపోయాయి. వాటిల్లో చాలా మొక్కలు చనిపోయాయి. ఇంకొన్నిచోట్ల అసలు మొక్కలే లేకుండా పోయాయి. ఇందుకు సుజాతనగర్ మండల సర్వారం, చుంచుపల్లి మండల మండలం హౌసింగ్ బోర్డు కాలనీల్లోని ఈ చిత్రాలే సాక్ష్యాలు.

–భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 6 (నమస్తే తెలంగాణ)

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి బ్యాటరీ టెస్ట్

పాల్వంచ రూరల్, మార్చి 6: కిన్నెరసాని క్రీడాపాఠశాల, కాచనపల్లి బాలికల క్రీడాపాఠశాల 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి తొమ్మిది అంశాలతో కూడిన బ్యాటరీ టెస్ట్ రెండోరోజైన బుధవారం కొనసాగింది. జిల్లావ్యాప్తంగా 120 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ బ్యాటరీ టెస్ట్‌ను ఐటీడీఏ డీడీ మణెమ్మ పరిశీలించారు. జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు, క్రీడల ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, హరికృష్ణ, కృష్ణారావు, రవి, వీరన్న, నాగరాజు, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట, మార్చి 6 : పామాయిల్ రైతులకు ఆర్థిక తోడ్పాటునందించడం కోసం ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు డీసీసీబీ సీఈవో ఏయూ రెహమాన్ తెలిపారు. స్థానిక రైతువేదికలో బుధవారం ఆయన పామాయిల్ రైతులతో రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రాప్ లోన్ కింద రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని, నాబార్డు నుంచి కొత్తగా ప్లాంటేషన్ వేసుకునే రైతులకు నాలుగేళ్ల పాటు ఎకరాకు రూ.1.35 లక్షల రుణం, డీసీసీ బ్యాంక్ ఎకరాకు రూ.50 వేల చొప్పున రుణం, వ్యవసాయ భూమిని మార్ట్‌గేజ్ చేసే రైతులకు ఎకరాకు రూ.4 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని తెలిపారు. ఇతర బ్యాంకుల కంటే మెరుగైన రుణ సదుపాయం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందని అశ్వారావుపేట సొసైటీ డైరెక్టర్ బత్తిన పార్థసారథి, రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, తుమ్మా రాంబాబు, ఆళ్ళ నాగేశ్వరరావులు సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రైతులు లేవనెత్తిన సమస్యలపై డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, బ్యాంక్ మేనేజర్ ఆర్.అనూష, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్, సుంకవల్లి వీరభద్రరావు, మొగళ్ళపు చెన్నకేశవరావు, సొసైటీ సీఈవో మానేపల్లి విజయ్ బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

అశ్వారావుపేట రూరల్, మార్చి 6 : భూమికి, మనుషుల ఆరోగ్యానికి రసాయన ఎరువుల వల్ల నష్టం జరుగుతుందని, అయితే ప్రకృతి వ్యవసాయం చాలా మేలు చేస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం నందిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వర్షధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామని, దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవో దృష్టికి తీసుకెళ్లారు. పంటలు పండించుకోవడానికి నీటి సౌకర్యం కోసం బోర్లు వేయించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం కోసం రూ.30 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయని, వీటితో గ్రూపులుగా ఏర్పడి రైతులు బోర్లు వేయించుకోవాలని పీవో సూచించారు. విద్యుత్ లైన్ల కోసం 2020లో రూ.90 వేలతో డీడీలు తీశామని, ఇప్పటి వరకు లైన్లు ఇవ్వలేదని పీవోకు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి గురువారం సాయంత్రం వరకు నివేదిక ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈ సంతోశ్‌ను పీవో ఆదేశించారు. జీవ వనరుల కేంద్రం ఒకటి మంజూరు చేస్తానని, స్థలం చూసుకోవాలని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం మల్లాయిగూడెంలో జీవ వనరుల గురించి నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్ వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. మల్లాయిగూడెం జీవ ప్రాజెక్టు కషాయాల గురించి ఆర్పీ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, ఏపీవో మధుబాబు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో నవీన్, హెచ్‌వో సందీప్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

14 నుంచి రామయ్య సన్నిధిలో ఫాల్గుణ మాస పూజలు

భద్రాచలం, మార్చి 6: ఫాల్గుణ మాసం సందర్భంగా ఈ నెల 14 నుంచి భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. తొలి రోజు మీన సంక్రమణం సందర్భంగా స్వామివారికి చుట్టు సేవ, 15న సంధ్యా హారతి, చుట్టు సేవ, 19న పునర్వసు నక్షత్రం సందర్భంగా తిరుమంజనం, పునర్వసు సేవ, 20న సర్వ ఏకాదశి, పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వామివారికి పట్టాభిషేకం, తిరువీధి సేవ, చుట్టు సేవ, 24న ఉత్సవాలకు అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, 25న విశేష స్నపన తిరుమంజనం, తలంబ్రాలు కలిపే వేడుక, పసుపు కొమ్ములు దంచడం, వసంతోత్సవం, డోలోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఇదేరోజు రామయ్య కల్యాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వసంతోత్సవం సందర్భంగా నిత్య కల్యాణ వేడుకను నిలిపివేస్తున్నామన్నారు. ఏప్రిల్ 5న సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన, విశేష భోగ నివేదన, స్వామివారికి సంధ్యా హారతి ఇస్తామన్నారు.